సాక్షి రంగారెడ్డి

సోమవారం । 17 । మార్చి । 2025




హైవేపై కూలిన మర్రిచెట్లు

హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై రెండు చోట్ల ప్రమాదవశాత్తు రెండు మర్రిచెట్లు విరిగి పడ్డాయి. త్రుటిలో ప్రమాదం తప్పింది. 8లో▸



2 నిమిషాలకో మెట్రో!

ఎండల తీవ్రత పెరుగుతుండటంతో నగర వాసులు మెట్రో వైపు మొగ్గుచూపుతున్నారు. రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. 8లో▸



న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ద్వంద్వ వైఖరి



దీక్ష చేపట్టిన నాయకులు

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ స్పష్టం చేశారు. వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు అన్ని రకాల పరీక్ష ఫలితాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో చేపట్టిన దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై గత ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించారని, ఈ మేరకు ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు వర్గీకరణ వర్తింజేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. అసెంబ్లీలో ఈనెల 18న చట్టం చేస్తామని చెబుతూనే మరోవైపు ఉద్యోగ పరీక్షల ఫలితాలు విడుదల చేస్తూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, చెన్నగళ్ల శ్రావణ్, పాండు, యాదగిరి, జోగు శ్రీశైలం, శ్రీను, హరీష్, వినోద్, మధు, శివశంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

షాద్‌నగర్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఎనిమిది నెలల నుంచి ప్రభుత్వం గుడ్ల బిల్లులు, మూడు నెలల నుంచి గౌరవ వేతనం, మెనూ చార్జీలు చెల్లించకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బిల్లులు ఇవ్వకుంటే విద్యార్థులకు ఎలా భోజనం అందిస్తారని ప్రశ్నించారు. రోజు రోజుకూ నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను ఏవిధంగా సరఫరా చేస్తుందో అలాగే మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు, కార్మికులు శ్రీలత, శ్రీనివాస్, వసంత, సంతోష, సత్తెమ్మ, వెంకటమ్మ, అనిత, షాహినీబేగం తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



ఇంటి పన్నుల వసూళ్లను పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీఓ సాధన

ఇబ్రహీంపట్నం: ఈనెలాఖరులోగా వంద శాతం పన్నులు వసూలు చేయాల్సిందేనని డీఎల్‌పీఓ సాధన పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని ముకునూర్‌లో వివిధ రకాల టాక్స్‌ల వసూళ్లను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31లోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ సిబ్బంది శ్రీకాంత్, ఉస్మాన్, అశోక్ ఉన్నారు.

నేడు ఓయూ బంద్‌కు పిలుపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళనలపై అధికారులు విధించిన నిషేధంపై విద్యార్థి సంఘాల నేతలు, ప్రొఫెసర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్‌ఎస్‌వీ, ఎంఎస్‌ఎఫ్, దళిత, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆర్ట్స్ కాలేజీ ఎదుట సమావేశమై అధికారుల తీరుపై మండిపడ్డారు. యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించలేని, పాలన చేతకాని వీసీ ప్రొ.కుమార్ విద్యార్థుల ఆందోళనలపై నిషేధం విధించడం సిగ్గుచేటన్నారు. ఆందోళనలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వీసీ ప్రొ.కుమార్ నియంతృత్వ పోకడలకు, ఆందోళనలపై నిషేధాలకు వ్యతిరేకంగా సోమవారం ఓయూ బంద్‌కు ఏబీవీపీ నాయకులు పిలుపునిచ్చారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

లోపించిన ‘చెత్త’శుద్ధి



షాద్‌నగర్ మున్సిపాలిటీ సోలీపూర్‌లో..

- మున్సిపాలిటీల్లో పేరుకుపోతున్న కుప్పలు
- రోడ్లపై పారుతున్న డ్రైనేజీ నీరు
- అపరిశుభ్రంగా వీధులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- నిర్వహణ కరువు

మున్సిపాల్టీలు కంపు కొడుతున్నాయి.. పారిశుద్ధ్యం పడకేసింది.. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా పేరుకుపోతోంది.. సరైన దంపు యార్డులు లేక ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను తీసుకెళ్లి ఊరి బయట పడవేస్తున్నారు.. అక్కడే కాల్చి వేస్తుండడంతో దట్టమైనపొగలు వ్యాప్తి చెందుతున్నాయి.. కాలనీల్లో డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతోంది.. నిర్వహణ, పర్యవేక్షణ కరువై పుర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలు వ్యాపిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నారు.

ఆగని పొగలు.. తీరని వెతలు

శంకర్‌పల్లి: ఐదు గ్రామాల కలయికతో 2018లో మున్సిపాలిటీ ఆవిర్భవించింది. ఇక్కడ డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది. స్థలం కోసం అన్వేషిస్తున్నప్పటికీ దొరకడం లేదు. గతంలో రెవెన్యూ అధికారులు సింగాపురం సమీపంలో అసైన్డ్ భూమిని కేటాయించగా.. అక్కడి స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో అడుగు ముందుకు పడడం లేదు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు మున్సిపాలిటీ అవసరాలను తగినంత లేకపోగా.. దానిపై నుంచి 400 కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్లు ఉన్నాయి. ఆకతాయిలు, చెత్త సేకరించే వారు నిప్పు వేయడంతో పెద్ద ఎత్తున మంటలు, పొగలు వ్యాపిస్తున్నాయి. కిలో మీటర్ల మేర పొగలు వ్యాపిస్తుండడంతో సమీపంలోని ఆదర్శనగర్, సింగాపూర్, బొప్పన్న వెంచర్‌వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు తడి, పొడి చెత్త సేకరణ ముందుకు సాగడం లేదు.

సమస్యలు పరిష్కరిస్తాం

మున్సిపాలిటీలో 52మందితో నిత్యం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయిస్తున్నాం. డంపింగ్ యార్డు సమస్య ఉన్న మాట వాస్తవమే. స్థల సమస్యపై రెవెన్యూ అధికారులతో మాట్లాడి త్వరలోనే కొత్తది నిర్మిస్తాం. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. నిప్పు వేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం. – యోగేశ్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి



డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగలు

రోడ్ల పక్కన చెత్త.. ఇళ్ల మధ్య మురుగు

మొయినాబాద్: కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. మున్సిపల్ కేంద్రంలో ఇప్పటికీ రోడ్లపక్కనే చెత్తా చెదారం వేస్తున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు సైతం సరిగా లేకపోవడంతో ఇళ్ల మధ్య, రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టినా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను చేపట్టలేకపోతున్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో 8 ట్రాక్టర్లు, 20 ఆటోల ద్వారా చెత్త సేకరణ చేపడుతున్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయాలని మున్సిపల్ అధికారులు చెబుతున్నా ప్రజలు మాత్రం ఇంకా దానికి అలవాటు పడలేదు. ఏ గ్రామాల్లో సేకరించిన చెత్తను అదే గ్రామాల్లోని డంపింగ్ యార్డుల్లో వేస్తున్నారు. మొయినాబాద్‌లో డంపింగ్ యార్డు లేకపోవడంతో అక్కడి చెత్తను అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.



మొయినాబాద్‌లో ఇళ్ల మధ్యే పారుతున్న మురుగునీరు

చర్యలు తీసుకుంటాం

పారిశుద్ధ్య నిర్వహణ ప్రత్యేకంగా దృష్టి పెట్టి మురుగు కాలువలు శుభ్రం చేయిస్తున్నాం. ట్రాక్టర్లు, ఆటోలు పెట్టి చెత్త సేకరణ చేపడుతున్నాం. రాత్రి సమయంలో రోడ్ల పక్కన చెత్త వేస్తున్నారు. దీనిపై దుకాణదారులు, ప్రజలకు అవగాహన కల్పించినా మార్పు రావడంలేదు. రోడ్ల పక్కన చెత్త వేసేవారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వరరెడ్డి, శానిటరీ అధికారి

అపరిశుభ్రంగా రోడ్లు



సూరం చెరువు సమీపంలో పేరుకుపోయిన చెత్త

తుక్కుగూడ: పురపాలక సంఘం పరిధిలోని తుక్కుగూడ నుంచి బాసగూడతండా వెళ్లే రోడ్డు, రావిర్యాల నుంచి ఆర్‌సీఐ రోడ్డు, ఔటర్ రింగు సర్వీసు రోడ్లు పూర్తిగా అపరిశుభ్రంగా మారాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, ప్లాస్టిక్ కాగితాలు పేరుకుపోయాయి. అధికారులు స్వచ్ఛ వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలను ఉపయోగించి గృహాలు, వ్యాపార సముదాయులు, పరిశ్రమల నుంచి రోజుకు 9 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఇలా సేకరించినప్పటికీ నగరం నుంచి రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు, కొంత మంది స్థానికులు చెత్తను తెచ్చి ప్రధాన రోడ్లపై వేస్తున్నారు. ఇందులో జంతు వ్యర్థాలు సైతం ఉంటున్నాయి. చెత్తను ఆరుబయట వేయకుండా అవగాహన కల్పించాలని, చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని స్థానికులు కోరుతున్నారు.

ఊరిబయట దంపు.. ఊళ్లోకి కంపు

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 28వార్డులు ఉన్నాయి. సుమారుగా 20వేల ఇళ్లు ఉన్నాయి. పట్టణంలో సుమారు లక్షకు పైగా నివాసం ఉంటున్నారు. ప్రతి రోజు మున్సిపల్ సిబ్బంది సుమారు 34 మెట్రిక్ టన్నుల (మూడు వేల కిలోల) తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 400 కిలోల వరకు కూరగాయల వ్యర్థాలు ఉంటున్నాయి. చెత్త సేకరణ కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను సేకరిస్తున్నారు.

సోలీపూర్ శివారులో దంపు

మున్సిపాలిటీ రోజురోజుకూ విస్తరిస్తోంది. పట్టణంలో సేకరించిన చెత్తను మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో పారబోస్తున్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ చెత్తను కాల్చివేయడం ద్వారా పొగ గ్రామం మొత్తం వ్యాపిస్తోంది. చెత్తలో ఉన్న మాంసం వ్యర్థాల కోసం కుక్కలు విపరీతంగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాయి. దోమలు, ఈగలు విపరీతంగా వ్యాపిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డంపింగ్ యార్డును తరలించాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

డంపింగ్ యార్డును తరలించాలి



చెత్తనంతా తెచ్చి సోలీపూర్ శివారులో పడేస్తున్నారు. గ్రామంలో విపరీతంగా ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. రోగాలతో అవస్థలు పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించాలి.

– జంగయ్య, సోలీపూర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ

అవస్థలు పడుతున్నాం



సోలీపూర్ శివారులో రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ చెత్త పడేస్తున్నారు. కుప్పలుగా పేరుకుపోయిన చెత్తను కాలుస్తుండటంతో రోజుల తరబడి పొగ వ్యాపిస్తోంది. ఈ పొగతో ఊపిరి ఆడటం లేదు. అవస్థలు పడుతున్నాం.

– కొమురయ్య, సోలీపూర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ

ఎక్కడపడితే అక్కడే చెత్త



శంకర్‌పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

చేవెళ్ల: కొత్త మున్సిపాలిటీలో చెత్త సమస్యగా మారింది. పలు కాలనీల్లో, ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడపడితే అక్కడ పడేసి డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మున్సిపాలిటీ నూతనంగా ఏర్పాటు కావడంతో ఇప్పుడిప్పుడే విధులపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. చెత్త సేకరణ కోసం ఇంటికి వచ్చే ఆటోలో మాత్రమే చెత్త వేయాలని, ఖాళీ ప్రదేశాల్లో పడేయొద్దని కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని అంటున్నారు. చెత్త సేకరణకోసం మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక కాంట్రాక్ట్ వ్యవస్థ ఉందన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని చెబుతున్నారు.

సేకరిస్తున్నా పేరుకుపోతోంది

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో 32 డివిజన్లు ఉన్నాయి. నిత్యం 50 టన్నులకు పైగా చెత్తను సేకరిస్తున్నారు. సేకరించిన చెత్తను కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో నిర్మించిన డీఆర్‌సీకి, అక్కడి నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయినా రాత్రివేళ రోడ్లకు ఇరువైపులా, ఓపెన్ ప్లాట్లలో, కాలనీల మలుపుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేస్తున్నారు. దీంతో కుప్పలుగా పేరుకుపోతోంది. ఎప్పటికప్పుడు పడేసిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నామని శుభ్రం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అవగాహన కల్పిస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా మార్పు రావడం లేదని అంటున్నారు.



లారీల్లో తరలిస్తున్న చెత్త

రంగులతో ముగ్గులు, జరిమానా

మలుపులు, కూడళ్ల వద్ద చెత్తను నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. మహిళా సిబ్బందితో చెత్త వేయొద్దని రంగురంగుల ముగ్గులు వేయిస్తున్నాం. చెత్త వేస్తే జరిమానా సైతం విధిస్తున్నాం. ప్రజల్లోనూ మార్పు రావాలి. – వి.యాదగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పారిశుద్ధ్య సిబ్బంది కొరత

ఆమనగల్లు: విఠాయిపల్లి గ్రామాన్ని కలిపి ప్రభుత్వం ఆమనగల్లు మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా అవసరమైన సిబ్బందిని మాత్రం నియమించలేదు. పట్టణంలో పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది. ప్రతిరోజూ ప్రధాన రహదారిని మాత్రం శుభ్రం చేస్తుండగా కాలనీల్లో మాత్రం రెండుమూడు రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు. మున్సిపాలిటీలో 48 మంది పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. చెత్త సేకరణకు ఆరు ఆటోలు, రెండు ట్రాక్టర్లు ఉన్నాయి. నిత్యం 1.8 టన్నుల తడిచెత్త, 2.1 టన్నుల పొడిచెత్తను సేకరించి పట్టణ సమీపంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 17 కిలోమీటర్ల భూగర్భ మురుగు కాలువలు ఉన్నాయి. పలు కాలనీల్లో మురుగు కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. మరో రెండు కిలోమీటర్ల మురుగు కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.



ఆమనగల్లులోని ఓ కాలనీలో రోడ్డు పక్కన చెత్త

కొత్త కాలనీల్లో సమస్యలు

కొత్తూరు: మున్సిపాలిటీలో ప్రస్తుతం 12 వార్డులు, సుమారు 20 వేల మంది జనాభా ఉన్నారు. కొత్తగా విస్తరించిన వింటేజ్, శ్రీరామ్‌నగర్, తిరుమల కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేవు. నిత్యం మున్సిపాలిటీలో 35 మంది సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, హోటళ్ల నుంచి సేకరించి చెత్తను నాలుగు ట్రాక్టర్లు, మూడు ఆటోల్లో పారిశ్రామికవాడ సమీపంలో ఉన్న డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. ప్రస్తుతానికి మున్సిపాలిటీలో 42 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఉంది.



చెత్తను సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

హాజరు కానున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారమహోత్సవ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్ కోరారు. ప్రమాణస్వీకార మహోత్సవ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హాజరవుతారని చెప్పారు. తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వరకు కార్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్

మద్యం మత్తులో భార్యను తోసేసిన భర్త

శంషాబాద్ రూరల్: మద్యం మత్తులో భార్యను తోసేయడంతో బస్సు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివీ.. దేవరకద్ర మండలం కౌకుంట్లకు చెందిన బద్దన్న, పద్మ దంపతులు మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడలో నివాసముంటున్నారు. స్వగ్రామానికి వెళ్లేందుకు శంషాబాద్ బస్టాండ్‌కు వచ్చారు. షాద్‌నగర్ వైపు వెళ్లే మార్గంలో బస్సు కోసం వేచి ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరూ గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న బద్దన్న భార్యను తోసేశాడు. ఇదే సమయంలో అఫ్జల్‌గంజ్ నుంచి శంకరాపురం వెళ్తున్న బస్సు పద్మను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బద్దన్నను చితకబాదారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిశ్చితార్థం రద్దు చేయించి..

- పెళ్లిచేసుకుంటానని మోసం చేసిన ప్రేమికుడు
- యువకుడి ఎదుట ధర్నా అట్రాసిటీ కేసు నమోదు


పూర్ణేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: ప్రేమించానని ఏడేళ్లుగా వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, యువతి నిశ్చితార్థాన్ని సైతం రద్దు చేయించాడు. ఆపై ముఖం చాటేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధిత యువతి, మహిళా సంఘాల సహాయంతో కుటుంబ సభ్యులతో కలిసి యువకుడి ఇంటి ఎదుట ధర్నా చేశారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన ఓ యువతి(28)ని మీర్‌పేట ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీకి చెందిన పూర్ణేశ్వర్‌రెడ్డి(28) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె నిశ్చితార్థాన్ని రద్దు చేయించాడు. ఆమెతో చనువుగా ఉంటూ.. ఇంట్లో వారికి, బంధువులకు పరిచయం చేశాడు. కానీ ఆ తరువాత యువకుడికి గుట్టుచప్పుడు కాకుండా.. మరో యువతితో పెళ్లి చూపులు జరిగాయి. విషయం తెలుసుకున్న యువతి నిలదీయడంతో కులం వేరు కావడంతో మా ఇంట్లో ఒప్పుకోవడం లేదని సమాధానం చెప్పాడు. దీంతో సదరు యువతి న్యాయం చేయాలంటూ ఆదివారం పూర్ణేశ్వర్‌రెడ్డి ఇంటి ఎదుట బంధువులతో కలిసి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు.. యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

లింకురోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి


నాయకులతో మాట్లాడుచీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: పెండింగ్ రేగడిఘనాపూర్‌–చనువెళ్లి లింక్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు రఘువీర్‌రెడ్డి కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న చీఫ్ విప్.. ఆదివారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పట్నంను కలిసి, సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. గ్రామం నుంచి చనువెళ్లి లింక్‌రోడ్డుకు మంత్రిగా ఉన్న సమయంలో రూ.80 లక్షల నిధులు మంజూరు చేశారని, ఆ పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు. వెంటనే ఆయన పంచాయతీ రాజ్ ఎస్ఈకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ రోడ్డుపై ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన నిధులు రిజెక్ట్ అయ్యాయని, మరోసారి ప్రతిపాదనలు పంపాలని చెప్పినట్లు తెలిపారు. దీంతో ఆయన స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మాట్లాడి మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి ఈ ప్రాంతంలో ఇలా మిగిలిపోయిన బ్రిడ్జిలకు సంబంధించి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

హైవేపై కూలిన మర్రిచెట్లు

తప్పిన ప్రమాదం, ట్రాఫిక్ అంతరాయం

చేవెళ్ల: హైదరాబాద్‌– బీజాపూర్ రహదారిపై రెండు చోట్ల ప్రమాదవశాత్తు రెండు మర్రిచెట్లు విరిగి పడ్డాయి. ఈ సంఘటనలు చేవెళ్ల మండలం ఖానాపూర్ బస్టేజీ సమీపంలో ఒకటి, ఆలూరు బస్టేజీ సమీపంలో మరొకటి చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం స్వల్ప వ్యవధిలో రెండు చోట్ల చెట్లు కూలిపోయాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు పరుగు తీయకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మరోమార్గం లేకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ శంకరయ్య, ఏఎస్ఐ చందర్‌నాయక్‌లు సిబ్బంది, స్థానికుల సహాయంతో జేసీబీతో చెట్లను పక్కకు తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేయించారు.


జేసీబీతో చెట్టును తొలగింపజేస్తున్న పోలీసులు

ఈ మర్రి చెట్లు మొదళ్లు కాలిపోయి ఉండటంతో గాలి వీచిన సమయంలో ఇలా రోడ్డుపై పడిపోతున్నాయని, వాహనదారులు చెట్ల కింద ప్రయాణం చేసే సమయంలో తగిన జాగ్రత్త తీసుకోవాలని పోలీసులు సూచించారు.

గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కమలేష్ కుమార్, కౌసల్యా దేవి(25) దంపతులు. బతుకుదెరువు కోసం కొంత కాలం క్రితం శ్రీరాం కాలనీకి వలస వచ్చారు. ఈ నెల 15న సాయంత్రం 7 గంటలకు సరుకులు తెచ్చేందుకు బయటకు వెళ్లిన కమలేష్.. 20 నిమిషాల తరువాత ఇంటికి వచ్చి చూడగా.. భార్య కనిపించలేదు. వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో కమలేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి మృతి

మీర్‌పేట: స్విమ్మింగ్‌పూల్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గాయపడి, వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం రాచలపల్లె గ్రామానికి చెందిన ఎండీ హసన్(60) హస్తినాపురం జెడ్పీ రోడ్డులోని స్వస్తిక్ టిఫిన్ సెంటర్లో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సరదాగా ఈత కొట్టేందుకు తనతో పనిచేసే వారితో కలిసి మధ్యాహ్నం అల్మాస్‌గూడ ఆర్కా స్కూల్ సమీపంలోని జేఎస్ఆర్ స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాడు. హసన్ పూల్‌లోకి దూకేందుకు ప్రయత్నించగా.. సరిగ్గా డైవ్ చేయకపోవడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అర్చకుడికి 'సువర్ణ ఘంటా కంకణం' ప్రదానం


జ్ఞాపిక అందుకుంటున్న భవానీప్రసాద్

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట పరిధి శ్రీ అంబా భవానీమాత ఆలయ అర్చకుడు గుల్లె శివశంకర భవానీ ప్రసాద్‌కు పురోహిత వైభవ ప్రవీణ బిరుదును అందజేశారు. ఆదివారం నగరంలోని హరిహర కళాభవన్‌లో సీవీ రామన్ అకాడమీ(సేవా సాంస్కృతిక సంస్థ) రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవ సువర్ణ ఘంటా కంకణ(గోల్డ్ మెడల్స్) ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మర్షి డాక్టర్ శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి చేతులు మీదుగా.. అర్చకుడికి సువర్ణ ఘంటా కంకణం బహూకరించి, పురోహిత వైభవ ప్రవీణ బిరుదును అందజేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, శివవర్ధన్ బాబు, మధు, దుర్గా, వినోద్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి ఆత్మహత్య

మొయినాబాద్: ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెదిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ ఠాణా పరిధి చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరుకు చెందిన ముంజగళ్ల మహేశ్(29) కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఎలాంటి పనిచేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, రాత్రి 8.30 గంటలకు తిరిగి వచ్చాడు. అతని భార్య నవనీత బయటకు వెళ్లి తిరిగొచ్చేసరికి గది తలుపులు మూసి ఉన్నాయి. ఎంతకీ తీయకపోవడంతో.. చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అప్పటికే చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. పరిశీలించగా మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే తన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మీర్‌పేటలో డ్రైవర్..

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం కస్తూరికాలనీలో నివాసముండే లోగిట్ల మధుసూదన్(35) వృత్తి రిత్యా కారు డ్రైవర్. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మధుసూదన్ కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

2 నిమిషాలకో.. మెట్రో!

వేసవి రద్దీ దృష్ట్యా త్వరలో ట్రిప్పుల పెంపు

- రష్ కారిడార్లపై అధికారుల కసరత్తు
- ప్రస్తుతం రోజుకు 5 లక్షల కుపైగా ప్రయాణికులు
- ఏప్రిల్, మే నాటికి భారీగా పెరిగే అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: రోజు రోజుకూ మెట్రో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరుగుతోంది. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో నగర వాసులు మెట్రో వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ సుమారు 5.05 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తుండగా వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ప్రయాణికుల రద్దీ 5.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో జనం కిక్కిరిసి ప్రయాణిస్తుండగా ఏప్రిల్ నాటికి పరిస్థితి మరింత ఇబ్బందిగా మారనుంది. మెట్రోల్లో కనీసం నిల్చుని ప్రయాణం చేసేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొంది, ప్రతి మెట్రోస్టేషన్‌లో ఇప్పటికే కనీసం రెండు రైళ్లకు సరిపడా ప్రయాణికులు ప్రతి ట్రిప్పు కోసం పడిగాపులు కాస్తున్నారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసే అవకాశం లేకపోయినా అదనపు ట్రిప్పులను పెంచేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ చర్యలు చేపడుతోంది.

కొత్త కోచ్‌లు లేనట్లేనా..

❖ ప్రయాణికుల రద్దీ మేరకు మెట్రో సర్వీసులను ఇప్పుడున్న 3 కోచ్‌ల నుంచి 6 కోచ్‌లకు పెంచేందుకు ఏడాది క్రితమే ప్రణాళికలను రూపొందించారు. మహారాష్ట్రలోని నాగపూర్ మెట్రో నుంచి మెట్రో కోచ్‌లను తెప్పించనున్నట్లు ప్రతిపాదించారు. ఈ మేరకు ఎల్అండ్‌టీ అధికారులు సైతం కొత్త కోచ్‌లను తెప్పించనున్నట్లు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి పురోగతి లేదు. మరోవైపు ఎప్పటి వరకు వచ్చే అవకాశం ఉందనే విషయంలోనూ స్పష్టత లేకుండాపోయింది. మరోవైపు నగరంలో మెట్రోలను తీవ్రమైన నష్టాల్లో నడుపుతున్నట్లు చెబుతున్న ఎల్అండ్‌టీ కొత్త కోచ్‌లను ప్రవేశపెట్టేందుకు సంసిద్ధంగా ఉందా? అనే అంశం కూడా సందేహాస్పదమే.

❖ రాయదుర్గం– నాగోల్, ఎల్‌బీనగర్– మియాపూర్ రూట్‌లలో నడిచే రైళ్లు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ మేరకు మెట్రోలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఐటీ కారిడార్‌లలో పని చేసే ఉద్యోగులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారు సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నారు. విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాధారణంగా రద్దీ కారణంగా ఒక రైలు ఎక్కలేకపోయిన వాళ్లు మరో ట్రైన్ కోసం ధీమాగా ఎదురు చూస్తారు. కానీ ఆ తర్వాత వచ్చే రెండు రైళ్లు కూడా కిక్కిరిసి ఉండడంతో మెట్రో ప్రయాణం ప్రయాసగా మారుతోంది. ఈ క్రమంలో కొత్త కోచ్‌లు అందుబాటులోకి రాకపోయినా కనీసం ట్రిప్పులను పెంచేందుకు చర్యలు తీసుకోవడం ప్రయాణికులకు కొంత మేరకు ఊరట కలిగించనుంది.

త్వరలో 1,500 ట్రిప్పులు..

ప్రస్తుతం ప్రతి 3 నుంచి 5 నిమిషాలకు ఒకటి చొప్పున నడుస్తుండగా.. రద్దీ వేళల్లో ప్రతి 2 నిమిషాలకు ఒక మెట్రో చొప్పున అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 1,065 ట్రిప్పులు తిరుగుతుండగా త్వరలో రోజుకు 1,500 ట్రిప్పులు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ట్రిప్పుల పెంపుపై కసరత్తు చేపట్టనున్నారు. నాగోల్–రాయదుర్గం, ఎల్‌బీనగర్– మియాపూర్ కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ముఖ్యంగా సికింద్రాబాద్, తార్నాక తదితర ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌లకు రాకపోకలు సాగించే ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని షటిల్స్‌ను నడిపేందుకు సైతం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

వాటర్ ట్యాంక్‌లో పడి | పంచాయతీ కార్మికుడి మృతి

- ఆ నీటిని తాగామని గ్రామస్తుల భయాందోళన
- కరన్‌కోట్‌లో ఘటన


లక్ష్మప్ప (ఫైల్)

తాండూరు రూరల్: ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్‌లో పడి ఓ పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మప్ప(42) ఏడేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నారు. అప్పుడప్పుడు ఆయన వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి.. రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఆదివారం ఉదయం గ్రామంలోని పంచాయతీకి చెందిన బంగారమ్మ తాగునీటి ట్యాంక్‌పైన లక్ష్మప్ప బట్టలు కనిపించాయి. వెంటనే వెళ్లి చూడగా వాటర్ ట్యాంక్‌లో విగతజీవిగా పడున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అప్పటికే లక్ష్మప్ప మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదవశాత్తు ట్యాంకులో పడి మృతి చెందాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఓ కూతురు ఉంది.

శుభ్రం చేయించాం

కరన్‌కోట్ గ్రామంలోని బంగారమ్మ గుడి వద్ద ఉన్న తాగునీటి వాటర్ ట్యాంక్ 60 వేల నీటి సామర్థ్యం కలదని గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ ట్యాంక్ నుంచి జయశంకర్ కాలనీతో పాటు సీసీఐ కాలనీకి నీటి సరఫరా అవుతుంది. శనివారం రాత్రి పంచాయతీ కార్మికుడు ట్యాంకులో పడి మృతి చెందాడు. మృతదేహం నిల్వ ఉన్న నీరు ఆదివారం ఉదయం సరఫరా కావడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావును వివరణ కోరగా.. ట్యాంక్‌ను శుభ్రం చేయించామన్నారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


మధు(ఫైల్)

ఇబ్రహీంపట్నం: కనిపించకుండా పోయిన యువకుడి మృతదేహం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో లభ్యమైంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సింగారం మధు(24), శుక్రవారం నుంచి కనిపించకుండా పోయాడు. అతని ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద కుటుంబీకులు ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో తండ్రి జ్ఞానేశ్వర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం స్థానిక పెద్ద చెరువు తూము వద్ద మధు చెప్పులు, పర్సు, ఐడీ కార్డు, సెల్‌ఫోన్‌ను స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. డీఆర్ఎఫ్ బృందం చెరువులో గాలించి మధు మృతదేహాన్ని వెలికితీశారు. అవివాహితుడైన యువకుడి మరణానికి కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృతుడు రెండు నెలలుగా విధులకు హాజరు కావడంలేదని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు


స్వామివారి పల్లకీ సేవలో భక్తులు


శ్రీజగద్గురు నిరంజన మఠంలో భజనలు చేస్తున్న భజన మండలి సభ్యులు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన వీరశైవ సమాజం భక్తులు
- స్వామివారి సేవలో పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీనిరంజన మఠంలో ఆదివారం వీరశైవ సమాజం భక్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు మఠం మల్లికార్జున స్వామి, గడ్డం చంద్రశేఖర్‌స్వామి, మఠం విజయకుమార స్వాములు వీరశైవ సమాజం సభ్యులచే ఆరాధనోత్సవాల్లో భాగంగా శ్రీస్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, గంధం, సుగంధ ద్రవ్యాలతో బసవలింగేశ్వర స్వామివారికి అత్యంత వైభవంగా నమక చమక అధ్యాయాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. బిల్వాష్టకం, శివాష్టకం, అష్టోత్తర శతనామావళితో పూజలు నిర్వహించారు. దూప, దీప నైవేద్యాలను సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనిరంజన మఠం పీఠాధిపతులు డాక్టర్ సిద్ధలింగ మహాస్వామి వారికి వీరశైవ సమాజం భక్తులు పాదపూజ చేశారు. నిరంజన మఠంలో బసవలింగేశ్వర స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీ సేవ ముందు భక్తులు ఖడ్గాలు వేస్తూ స్వామివారిని స్మరించుకున్నారు. పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తూ ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ గురునాథ్‌రెడ్డి శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠాధిపతులు శ్రీజగద్గురు డాక్టర్ సిద్ధలింగ మహాస్వామివారు రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ గురునాథ్‌రెడ్డిని సన్మానించారు. పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం నియోజకవర్గ అధ్యక్షుడు కొవూరు విజయవర్ధన్, సమా జం సభ్యులు బిఆర్ విజయకుమార్, గంతల సంఘమేశ్వర్, బాలప్రకాశ్, తారాపురం రవి, గంటి సర్వేష్, రాకేష్, నాగభూషణం పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతన కోసం కేటాయించాలని, మనసుకు ప్రశాంతత చేకూరుతుందని శ్రీజగద్గురు నిరంజన మఠం పీఠాధిపతులు డాక్టర్ సిద్ధలింగ మహాస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో స్వామివారి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ప్రవచనాలు అందించారు. ప్రతిఒక్కరూ భక్తి, ధ్యానం, భగవత్ చింతన అలవర్చుకుంటే ఆరోగ్యంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. భక్తితో దేన్నైనా సాధించొచ్చన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ, ధర్మాన్ని పరిరక్షిస్తూ సమాజ అభివృద్ధికి కృషిచేయాలని తెలిపారు. నిర్మలమైన మనసుతో భగవంతుడిని ఆరాధిస్తే శక్తి సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ వింటేజ్ హోమ్స్‌లో నివాసం ఉండే ఎం.సౌమ్య.. వారం రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి మెయిన్‌డోర్ తాళం, బెడ్రూం తాళం పగలగొట్టి ఉంది. అల్మారాలోని సామగ్రి చిందరవందరగా పడేశారు. 1000 గ్రాముల వెండి, తులం బంగారం చోరీకి గురైనట్లు ఆమె గుర్తించింది. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సీఐతో పాటు ఎస్ఐ రాజు, క్రైం బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.